సంతోషించాడు. వచ్చిన కొత్తలో వాళ్లు బాగానే ఉన్నారు. కొంతకాలానికి పూర్వపు అలవాట్లు వారిని నిలవనీయ లేదు. తమ పాతమిత్రులను పోగేసి మళ్లీ జూదం మొదలుపెట్టారు. చేతికందిన సొమ్ము తీసుకుపోయి పొద్దస్తమానం ఆడేవారు.

పుత్రకునికి ఆ విషయం తెలిసింది. తండ్రులకు డబ్బు అందకుండా జాగ్రత్త పడ్డాడు. అంతేకాకుండా గ్రామంలో ఉన్న జూదగాళ్లందరినీ లేవగొట్టించాడు. దాంతో ఆ అన్నదమ్ములకు ఎక్కడలేని పౌరుషం వచ్చింది. పుత్రకుణ్ని అడ్డం తప్పిస్తే తప్ప.. తమ ఆటలు సాగవని భావించారు.

ఒకనాడు తండ్రి పుత్రకుణ్ని చేరి..

''కుమారా! నువ్వు కడుపులో ఉన్నప్పుడు నువ్వు క్షేమంగా ఉంటే వింధ్యారణ్యంలోని దుర్గాలయానికి తీసుకువస్తామని మొక్కుకున్నాం. మా మొక్కునిప్పుడు నువ్వు చెల్లించాలి'' అని కోరాడు.

''తప్పకుండా నాన్నగారూ! మీరు చెప్పినట్లే చేస్తాను'' అని పుత్రకుడు వింధ్యారణ్యానికి ప్రయాణం కట్టాడు.

అక్కడికి వెళ్లేసరికి అంతకుముందే తండ్రులు ఏర్పాటు చేసిన హంతకులు కొందరు పుత్రకుణ్ని చుట్టుముట్టారు. కాళ్లు చేతులు బంధించి, దేవీవిగ్రహం ముందుకు తీసుకువచ్చి బలివ్వడానికి పూనుకున్నారు.



''చివరిసారిగా అమ్మవారిని ప్రార్థించుకో!'' అని హెచ్చరిక జారీచేశారు.

ఆ సమయంలో పుత్రకుడు..

''పుట్టినవానికి ఎన్నటికైనా మరణం తప్పదు. దానికి నేను శోకించను. కానీ మీరెవరు.. దొంగలా?! నన్నెందుకు చంపుతున్నారు?! డబ్బుకోసమైతే నా దగ్గర ఇప్పుడు చిల్లిగవ్వ కూడా లేదు. మీరు నన్ను వదిలేసి, నాతో మా ఇంటికొస్తే కావాల్సినంత ధనమిస్తాను'' అని చెప్పాడు.

అందుకు వారిలో ఒకడు..

''పుత్రకా! నీ పరిస్థితి చూస్తుంటే జాలేస్తున్నది. నీ దగ్గర ఇప్పుడున్న డబ్బుకోసం నిన్ను చంపడం లేదు. మేము మీ తండ్రులకు జూదపు మిత్రులం. నిన్ను చంపితే మేం చక్కగా ఆడుకోవచ్చని.. అడ్డు తొలగించుకోవడానికి నిన్ను చంపుతున్నాం'' అని చెప్పాడు.

ఆ మాటతో పుత్రకునికి ఎక్కడలేని దుఃఖం ముంచుకొచ్చింది.

''బాబూ! జూదం మహాపాతకం, దారిద్ర్య కారణమని తెలియదా?! అందుకే నేను మిమ్మల్ని అదుపులో పెట్టాను. అంతేకానీ మీమీద కోపం ఏమీ లేదు. సరే కానివ్వండి. మీ కర్తవ్యం నెరవేర్చండి. దయచేసి ఈ వార్త మా తల్లులకు తెలియచేయవద్దు. ఇదే నా చివరికోరిక'' అని బలిపీఠంపై తలను ఆన్చాడు.

అతణ్ని చంపడానికి కత్తి ఎత్తినవాడికి ఆ దృశ్యాన్ని చూసి మనసు కరిగి నీరైపోయింది. కత్తి పక్కన పారేసి, కట్లు విప్పాడు.

''పుత్రకా! నువ్వు మాకొక్క మాటివ్వాలి. ఇకపై ఎప్పుడూ చించినీపురం కేసి తిరిగి చూడకు. నువ్వు బతికే ఉన్నావని తెలిస్తే మీ తండ్రులు మమ్మల్ని బతకనివ్వరు'' అని పలికి తమ దారిన తాము పోయారు.

'ఆహా! నా సంపదలన్నీ ఎంతలో దూరమైపోయాయి'.. అని విచారిస్తూ పుత్రకుడు వాళ్లు వెళ్లిన దిక్కుకు కాకుండా వేరొక దిక్కుకు ప్రయాణించసాగాడు. ఆ అడవిలో ఎంతదూరం ప్రయాణించినా జనసంచారం కనిపించలేదు. దారిలో దొరికిన పళ్లు తింటూ, రాత్రిపూట చెట్లెక్కి కొమ్మలసందున నిద్రిస్తూ నాలుగురోజులు ప్రయాణించాడు. ఐదోనాడు ఒక చోట చిన్నమెట్ట వంటిది కనిపిస్తే దానిపైకి వెళ్లాడు.

అక్కడ ఎవరో ఇద్దరు అన్నదమ్ములు తమలో తాము తగాదా పడుతున్నారు. వాళ్ల ముందు మూడు వస్తువులు ఉన్నాయి.

అవి.. ఒక బొంతసంచి, ఒక యోగదండం, ఒక జత పాదరక్షలు.

''తమ్ముడా! మన తండ్రి ఘోరతపస్సు చేసి, అపురూపమైన ఈ మూడు వస్తువులూ సంపాదించాడు. వీటి మీద మనిద్దరికీ సమానమైన అధికారం ఉంది. వీటిని మనం ఉమ్మడి ఆస్తిగానే భావిద్దాం. పాళ్లు పంచుకోవడం ఎందుకు?'' అన్నాడు అన్నయ్య.

''కుదరదు. నాకు ఎవరితోనూ ఉమ్మడి పనికిరాదు. పంచి తీరాల్సిందే!'' అని పట్టుబట్టాడు తమ్ముడు.

''అయితే జ్యేష్ఠభాగం కింద ఈ సంచీని నాకు వదిలేయి. దండం, పాదరక్షల్లో నీకు కావలసింది నువ్వు తీసుకుని, మిగిలిందే నాకివ్వు'' అన్నాడు అన్నయ్య.

''అలా కుదరదు. అసలు మహిమంతా సంచీలోనే ఉంది. నాకు సంచీయే కావాలి'' అని పంతంపట్టాడు తమ్ముడు.

''పోనీ పాదుకలు, దండం చెరొకటీ తీసుకుని.. సంచీని ఉమ్మడిగా ఉంచుకుందాం'' అని అన్నయ్య ప్రతిపాదించాడు.

''నేనొప్పుకోను. ఉమ్మడిగా ఏదీ ఉండటానికి వీల్లేదు. పంచి తీరాల్సిందే!'' అని ఎదురు తిరిగాడు తమ్ముడు.

ఆ అన్నదమ్ములకు వాళ్లలో వాళ్లకు వాటాలు తెగడం లేదు.

అంతలో పుత్రకుడు వాళ్లను సమీపించాడు. అన్నదమ్ములిద్దరూ అతణ్ని గౌరవంగా దగ్గరికి పిలిచి కూర్చోబెట్టుకున్నారు.

వాళ్లలో పెద్దవాడు తమ కథనిలా చెప్పసాగాడు.

''అయ్యా! నా పేరు నందుడు. వీడు నా తమ్ముడు ఉపనందుడు. ఈ సందిగ్ధ సమయంలో దైవం పంపినట్లే నువ్వు వచ్చావు. మా తగువు విని, నీకు తోచినట్లు న్యాయం చెప్పు. ఇవిగో ఈ మూడు వస్తువులనూ మా తండ్రిగారు చాలాకాలం హిమాలయాల్లో తపస్సు చేసి సంపాదించుకున్నారు. ఈ బొంత సంచిని ఆ దండంతో ఒకసారి కొట్టి దులిపితే.. దాంట్లోంచి కావాల్సినన్ని నాణేలు రాలుతుంటాయి. అంతేకాకుండా దండానికి మరో ప్రయోజనం కూడా ఉంది. దీనితో ఒక వైపు గీస్తే పల్లె, మరోవైపు గీస్తే పట్టణం పుడతాయి. సమస్త ధనకనక వస్తువాహనాలతో, ప్రజలతో ఆ రాజ్యం దండం ధరించినవాని పరం అవుతుంది. ఇవిగో.. ఈ పాదుకలను తొడుక్కుని, ఎక్కడికి పోవాలని తలచుకుంటే అక్కడికి చిటికెలో ఆకాశమార్గంలో పోగలుగుతాం. ఈ మూడు వస్తువులనూ పితృధనంగా మాకిచ్చి మా తండ్రిగారు స్వర్గస్తుడయ్యాడు. వీటిని సమానంగా పంచుకోవాలంటే మాలో మాకు పాళ్లు కుదరడం లేదు. నువ్వు తీర్పు చెప్పు. నువ్వెలా చెబితే మేమిద్దరం అలాగే నడుచుకుంటాం'' అన్నాడు.

ఆ కథంతా విని.. 'ఛీఛీ! ద్రవ్యం వంటి దుష్టపదార్థం మరొకటి లేదు కదా! ఇప్పుడు వీరిని మోసం చేయాలని నాకే బుద్ధి పడుతున్నది' అని మనసులో తలపోశాడు. కానీ, ఆ ఊహను అణచి ఉంచుకోవడం అతని వల్ల కాలేదు. ఆ దివ్యవస్తువులను ఎలాగైనా తాను సొంతం చేసుకోవాలని ఒక యుక్తి పన్నాడు.

''బాబూ! నేనీ గుట్టనెక్కి చేతి సత్తువ కొద్దీ ఒక కట్టెపుల్లను దూరంగా విసురుతాను. మీరిద్దరూ పరుగెత్తుకుని వెళ్లి ఆ పుల్ల తీసుకురావాలి. ఎవరు ముందుగా వస్తే వారికి సంచి ఇస్తాను. మిగిలిన వస్తువుల కోసం మరోసారి పరుగుపందెం పెడతాను'' అన్నాడు.

అన్నదమ్ములిద్దరూ అమాయకంగా అతని మాటలు నమ్మారు. తమ వస్తువులను పుత్రకుని వద్దనే విడిచిపెట్టి అతను విసిరిన కట్టెపుల్లను తీసుకురావడానికి పరిగెత్తారు.

పుత్రకుడు వెంటనే పాదుకలు తొడుక్కుని, మిగిలినవి చేత్తో పట్టుకుని..

'నేను ఉత్తరదేశపు అడవులలో, పర్వత శిఖరాన జలాధార సమృద్ధిగా ఉన్నచోటికి వెళ్లాలి' అని తలుచుకున్నాడు.

కళ్లుమూసి తెరిచేంతలో పుత్రకుడు తాను కోరుకున్న చోటికి చేరిపోయాడు. ఆ ప్రదేశం చాలా మనోజ్ఞంగా ఉంది. సుందరమైన వనమధ్యంలో నిర్మల తటాకం కనువిందు చేసింది. మనుచరిత్రలో ప్రవరాఖ్యునిలా తనను చిటికెలో అక్కడికి చేర్చిన పాదుకల ప్రభావానికి ఆనందపడుతూ పుత్రకుడు ఆ ప్రదేశంలో కలియతిరిగాడు.

జాము పొద్దెక్కింది. తీక్షణంగా ఎండ కాయసాగింది. పుత్రకుడు కాసిన్ని పళ్లు తిని, స్నానం చేయడం కోసం ఆ పాదుకలను గట్టుమీద విడిచిపెట్టాడు.
పక్కనే సంచిని, దండాన్ని, తన దుస్తులను ఉంచి తటాకంలోకి దిగాడు. ■

**(వచ్చేవారం.. మర్రిచెట్టు మీద బొంతసంచి)**